www.samasamajam.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
గురు వారం
12 జనవరి, 2023
సంపుటి - 07,
సంచిక-233
పేజీలు - 4
వెల రూ. 5/-

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోసుకొండ వృద్ధిరాజు ❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Vishakapatnam, Vijayawada, Ongole

# తెలంగాణ కొత్త సిఎస్‌గా శాంతికుమారి

## సిఎం కెసిఆర్ నిర్ణయంతో నియామకం





ఎమ్మెస్సీ మెరైన్ బయాలజీ చదివిన శాంతి కుమారి అమెరికాలో ఎంబిఏ కూడా పూర్తి చేశారు. గత మూడు దశాబ్దాలుగా ఐఏఎస్ గా పేదరిక నిర్మూలన, సమ్మిళిత అభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్య రంగాలు, స్కిల్ డెవలప్ మెంట్, అటవీశాఖల్లో వివిధ హెూదాల్లో సేవలంది ంచారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమా ల్లో రెండేళ్లపాటు పనిచేశారు. గతంలో నాలుగేళ్లపాటు సీఎం కార్యాల యంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా, టీఎస్ ఐపాస్ లో ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ స్పెషల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. శాంతికుమారి ప్రస్తుతం అటవీశాఖలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పని చేశారు.

**హైదరాబాద్, జనవరి 11 (సమసమాజం):** తెలంగాణ కొత్త సీఎస్ ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. కొత్త సీఎస్ గా శాంతికుమారి నియామకం అయ్యారు. ఇందుకు సంబంధించి సిఎం కెసిఆర్ ఆదేశాలతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే ఆమె బాధ్యతలు కూడా స్వీకరించారు. 1989 బ్యాచ్‌కు చెందిన శాంతికుమారి గతంలో సీఎంవోలో కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం అటవీశాఖలో స్పెషల్ సీఎస్ గా ఉన్నారు. ఈమె ఏప్రిల్ 2025లో రిటైర్ కానున్నారు. తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వ కొత్త సీఎస్‌గా మహిళ శాంతికుమారికి అవకాశం దక్కింది. శాంతికుమారి 2025 ఏప్రిల్ వరకూ పదవిలో ఉండేందుకు అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం ఆమె వైపే మొగ్గు చూపింది. గతంలో.. శాంతి కుమారి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కూడా పనిచేశారు. శాంతికుమారి 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2025 ఏప్రిల్ వరకూ కొత్త సీఎస్‌గా శాంతికుమారి కొనసాగే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. ఆయన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు వెళ్లాల్సిందేనని మంగళవారం హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఉమ్మడి రాష్ట్రంలోని సివిల్ సర్వెంట్ల విభజన వివాదానికి ఈ తీర్పు ద్వారా ముగింపు పలికింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్ విభజన సందర్భంగా తన సీనియారిటీ ప్రకారం తాను ఆప్షన్ ఇచ్చిన తెలంగాణకు కాకుండా ఏపీకి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ సోమేశ్ కుమార్ 2014లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. దీనిని హైకోర్టు కొట్టివేసింది.

2వ

# ప్రధాని మోడీ పర్యటన వాయిదా

వందేభారత్ రైలు ప్రారంభం వర్చువల్‌గా !



**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటన వాయిదా పడింది. మోదీ హైదరాబాద్ పర్యటన వాయిదా పడినట్లు

3వ

# ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర

## కేంద్రం తీరుపై మండిపడ్డ కడియం



**హనుమకొండ,జనవరి11(సమసమాజం):** కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తున్నదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం వైఖరి అసమానతలను పెంచేలా ఉన్నదని మండిపడ్డారు. దళిత మేధావులు, ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తమవ్వాలని సూచించారు. హనుకొండలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా.. కులమతాల మధ్య బీజేపీ చిచ్చుపె

3వ

# చిరు వ్యాపారులకు జగన్ సర్కార్ అండ

- ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వడ్డీలేని రుణం
- మొత్తం రూ.395 కోట్లను విడుదల
- బటన్ నొక్కి ఖాతాల్లోకి నగదు జమ



**అమరావతి,జనవరి11(సమసమాజం):** ఆంధ్రప్రదేశ్‌లో చిరు వ్యాపారులకు జగన్ సర్కార్ అండగా నిలిచింది. ఈ ఏడాది కూడా జగనన్న తోడు పథకం కింద నిధులు విడుదల చేసింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి వారి అకౌంట్‌లలో

3వ

# మాకు పట్టిన గతే మీకు పట్టింది

సిఎస్ సోమేశ్‌కు రాసిన ఓ టీచర్ లెటర్ వైరల్

**కరీంనగర్,జనవరి11(సమసమాజం):** తెలంగాణ సీఎస్ సోమేశ్ కుమార్‌ను ఏపీకి వెళ్లాలంటూ హైకోర్ట్ ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తానిపర్తి తిరుపతి రావు అనే ఉపాధ్యాయుడు సోమేశ్ కు రాసిన లేఖ వైరల్ అవుతోంది. మాకు పట్టిన గతే మీకు పట్టిందని..తమ గోసే

3వ



# రెపరెపలాడిన భారతీయ చలనచిత్ర కీర్తిపతాక

- ఆర్ఆర్ఆర్ చిత్రం నాటునాటు పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు
- ఒరిజనల్ సాంగ్ విభాగంలో ఉత్తమపాటగా ఎంపిక
- అవార్డును అందుకున్న సంగీత దర్శకుడు కీరవాణి
- కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి, రామ్‌చరణ్, ఎన్టీర్
- ప్రపంచవ్యాప్తంగా చిత్రజట్టుకు ప్రశంసలు
- గోల్డెన్ గ్లోబ్ అవార్డుతో..భారత్ గర్వపడేలా చేశారు
- ఆర్ఆర్ఆర్ చిత్ర బృందానికి ప్రధాని మోడీ ప్రశంసలు
- మిమ్మల్ని చూసి దేశం గర్విస్తోంది
- నాటునాటుకు అవార్డుపై చిరు ఆనందం



**కాలిఫోర్నియా,జనవరి11(సమసమాజం):** భారతీయ చలనచిత్ర కీర్తపతాక మరోమారు ఎగిరింది. ఆర్ఆర్ఆర్ సినిమా సృష్టించిన ప్రభంజనం అంతాఇంతా కాదు. టాలీవుడ్ టాప్ దర్శకుడు రాజమౌళి రూపొందించిన ఆర్ఆర్ఆర్ సినిమా చరిత్ర సృష్టించింది. ప్రపంచ చలన చిత్రరంగంలో ఎంతో ప్రతిష్మాత్మకంగా భావించే 'గోల్డెన్ గ్లోబ్' అవార్డును దక్కించుకుంది. సినిమాలోని 'నాటునాటు' పాట.. ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఉత్తమ పాటగా ఎంపికైంది. కాలిఫోర్నియాలోని ది బెవర్లీ హిల్టన్ హాల్ వేదికగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం లో రాజమౌళి, ఎన్టీఆర్, చరణ్, కీరవాణి కుటుంబసమేతంగా పాల్గొన్నారు. నాటు నాటు'కు పురస్కారం ప్రకటించిన సమయంలో తారక్, చరణ్, రాజమౌళి.. తమ టేబుల్ వద్ద పైకి లేచి చప్పట్లు కొడుతూ, కేరింతలతో సందడి చేశారు. అనంతరం అతిరథ మహారథుల మధ్య ఈ అవార్డును సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అందుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందం ట్విట్టర్‌లో పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటునాటు' పాటకు ప్రఖ్యాత 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి అన్నారు. ప్రతిష్మాత్మక అవార్డు ఇచ్చిన హెచ్ఎఫ్‌పీఏకు ధన్యవాదాలు తెలిపారు. 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు తన సోదరుడికి దక్కాలని చెప్పారు. పాటలో భాగమైన రాహుల్ సిప్లిగంజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాటకు కాళభైవర అద్భుత సహకారం

3వ

# హైదరాబాద్ చేరుకున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ థాక్రే

## శంషాబాద్‌లో మాణిక్‌రావును ఘనంగా స్వాగతించిన రేవంత్



**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన మాణిక్‌రావు థాక్రే తొలిసారి హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న థాక్రేకి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఇతర సీనియర్ నేతలంతా ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నేరుగా గాంధీభవన్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా మాణిక్‌రావు థాక్రే.. తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మధుయాష్కీ, పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహతో వేర్వేరుగా భేటీ అవుతారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు ఆందోళన చేపట్టారు. థాక్రేకు

3వ

# ఆంధ్రా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

ఇప్పటికే నగరాన్ని వీడుతున్న ప్రజలు



3వ

**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** సంక్రాంతి పండుగొచ్చిందంటే దేశంలో ఎక్కడ ఉన్నా.. సొంతూళ్లకు పయనం అవుతున్నారు.

# కృష్ణాజలాల వాటా తేల్చండి

టిజెఎస్ కార్యాలయంలో కోదండరామ్ దీక్ష



**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** కృష్ణా నదీ జలాల వాటా సాధనకై టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ చీఫ్ ప్రొ. కోదండరాం జలదీక్ష చేపట్టారు. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణా వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కృష్ణా, గోదావరి నదులపై కేంద్ర

3వ

# గాంధీభవన్‌కు రాలేను : కోమటిరెడ్డి



3వ

**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** కాంగ్రెస్ సీనియర్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పార్టీ ప్రధాన కార్యాలయమైన గాంధీభవన్‌కు రావడానికి

# బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

## మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా హతం

**హైదరాబాద్,జనవరి 11(సమసమాజం):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిని నిర్ధారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో హిడ్మా ఉన్నట్లు సమాచారం. హిడ్మా ఉన్నాడనే సమాచారంతోనే సీఆర్పీఎఫ్ దళాలు కూంబింగ్ చేపట్టాయి. కూంబింగ్



2వ

# టీఎస్‌పీఎస్సీ ముందు గురుకుల పిఈటి అభ్యర్థుల ఆందోళన

TSPSC

**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముందు గురుకుల పిఈటి మెరిట్ సాధించిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు. 2017లో కష్టపడి గురుకుల పిఈటి పోస్టులు సాధించినా.. ఇప్పటి వరకు పోస్టులు ఇవ్వకపోవడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం వచ్చినా.. 2017 నుంచి ఇంత

3వ

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం!

- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- కొత్తవారి కదలికలపై సమాచారం అందించాలి
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచన

**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** సంక్రాంతి పండుగ పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది

3వ

## సంపాదకీయం

### జాతి ఐక్యతకు యువత నడుం బిగించాలి !

నేటి యువతకు స్వామి వివేకానంద బోధనలు అనురణీయం. నిర్వీర్యమై, నిరాశా నిస్పృహలో కొట్టుమిట్టా డుతున్న యువత మేల్కోవాలి. తమకోసం..తమవారి కోసం ..ఈ దేశంకోసం వారు నడుం బిగించాల్సి ఉంటుంది. దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మేరకు అడుగులు వేయాలి. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి. జాతిని జాగృతం చేసి దేశ ఐక్యతకు నడుంబిగిస్తేనే ..నవశకం ఆరంభం కాగలదు. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.. అంటాడు స్వామి వివేకానంద.. ఆయన మాటలన్నీ ప్రేరణకు స్ఫూర్తిగా నిలిచేవే. భారతదేశాన్ని చదవాలంటే వివేకానందుణ్ని చదివితే చాలు. రామకృష్ణ పరమహంస వద్ద నాలుగేళ్ల శుశ్రూషలో నరేంద్రుడు నేర్చుకున్న ఆదర్శాలే తరవాత అతడిని మహనీయుడిగా తీర్చి దిద్దాయి. సంపద సృష్టికర్తలైన శ్రామికులే ఈ దేశ ఆశాకిరణాలని స్వామి వివేకానంద ఆనాడే చెప్పారు. 18, 19 శతాబ్దాల్లో స్తబ్ధమైన భారతీయ సమాజాన్ని మేల్కొల్పడానికి రాజారామ్ మోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, దయానందసరస్వతి సారథ్యంలో కొనసాగిన సంస్కరణోద్యమాన్ని వివేకానందుడు గొప్ప ముందడుగు వేయించాడు. అనేక ప్రాచీన చింతనా ధోరణు లను స్ఫూర్తిగా తీసుకొని స్పష్టమైన దృక్పథంతో కార్యాచరణతో సమత జ్ఞాన విప్లవాన్ని వివేకానందుడు ఆరంభించాడు. వ్యవస్థీ కృతమైన రుగ్మతలను ఎదిరించడం, సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవా త్మక భావాలు ఇప్పటికీ అనుసరణీయంగా ఉన్నాయి. మృత ప్రాయంగా ఉన్న వ్యవస్థకు కొత్త ఊపిరిపోసి, కొత్త నెత్తురు ఎక్కించిన పునరుజ్జీవన, జాతీయోద్యమ, విప్లవోద్యమ కేంద్ర స్థానమైన బెంగాల్ మాగాణంలో ఉద్భవించిన మేధావి వివేకానందుడు. మనషిలో నిగూఢమై ఉన్న పరిపూర్ణ త్వాన్ని వ్యక్తం చేయించేది విద్య అని వివేకానందుడు నిర్వచించాడు. జీవితాన్ని నిర్మించడమూ, సద్గుణ సంపన్నులైన మనుషులను రూపొందించడమూ విద్య ఆశయాలుగా ఆయన పేర్కొన్నాడు. విద్యలో సమాన అవకాశాలను కల్పించిన ప్రాచీన నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి విద్యలయాల సుసంపన్న సంప్రదాయాన్ని పునఃప్రతిష్టింప చేయాలని, ప్రభుత్వము, పౌరసమాజం విద్యను అందించడమే ప్రథమ కర్తవ్యంగా చేపట్టాలని ప్రజలను చైతన్యవంతం చేశాడు. ఆ నాటి సమాజంలో వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగిక తను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల, సామాజిక బాధ్యత లేని పెట్టుబడి దారీ శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం. భారత దేశంలోఎందరో మహానుభావులు అప్పుడప్పుడూ తళుక్కున మెరిసి జాతిని మేల్కొలిపారు. సమాజాన్ని రుజువర్తనలో పెట్టే ప్రయత్నాలు చేశారు. ఆ తరవాత వారి అడుగు జాడల్లో నడిచి దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లిన వారూ ఉన్నారు. అలాంటి మహానుభావుల్లో స్వామి వివేకానందుడు అగ్రగణ్యుడు అని చెప్పక తప్పదు. వివేకానందుడు హిందూసమాజ పునరుజ్జీవ నానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ఆయన బోధనలు ఇప్పుడు ప్రపంచ మానవాళి అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. నిరాశలో కూరుకుపోయిన నేటియువత మేల్కో వాలి. జాతిని జాగృతం చేసే బాధ్యతను తీసుకోవాల్సి ఉంది. వివేకానందుడు ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్త కుడు. విచ్ఛిన్నకర శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో దేశాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఇప్పుడే ఉంది. దేశం పరాయిపాలన నుంచి విముక్తం అయ్యాక స్వార్థ రాజకీయ శక్తుల చేతుల్లో ఓడిపో తోంది. ఈ క్రమంలో యువత బాగా ఆలోచించాలి. పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకా నందుని కృషిని కొనసాగించడమే మార్గంగా ఎంచుకోవాలి. పేదవాని కష్టంతో పైకి వచ్చిన పాలకులు.. వారి బాగోగులను పట్టించుకోవడం లేదు. ఎప్పుడో వివేకానందుడు ఇలాంటి వన్నీ తన ప్రసంగాలతో ప్రపంచాన్ని ఉర్రూత లూగించారు. ఎంతో తత్వజ్ఞానం పొందిన స్వామి వివేకానంద మనలో ఉన్న జాడ్యాన్ని తొలగించి... ఉత్తేజితం చేసి ప్రేరణ కల్పించడానికి పుట్టిన ఓ మహా యుగకర్తగా భావించాలి. ప్రతి మతంలోను,ప్రతి సిద్ధాంతంలోను, ఎంతో కొంత మంచి వుంటుంది. సోదరప్రేమ గురించి ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శిం చండని పిలుపును ఇవ్వడమే కాదు.... ఆచరించి చూపాడు. వివేకానందుడు ప్రవచించిన మార్గం ఎప్పటికీ అనుసరణీయమే. దరిద్ర నారాయణసేవే పరమధర్మమని వివేకానందుడు అంటారు. మానవాళికి చైతన్య దీప్తిగా స్వామి వివేకానంద విశ్వవిఖ్యాతి పొందినాడు. కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలపై ఆయన చేసిన రచనలు ఆత్మశక్తిని వెలికితీసే ఆయుధాలు. గాంధీలాంటి అహింసా మూర్తులకూ, సుభాష్ చంద్రబోస్, అరవింద్ ఘోష్, జతిన్‌దాస్ లాంటి అతివాదులకూ వివేకానందుడు స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి బాటలో మనమెందుకు నడవకూడదన్న ఆలోచన చేయాలి. ప్రాచీన కాలపు గ్రీసులో సోక్రటీసు గొప్ప గురువు. ప్లేటో గొప్ప శిష్యుడు. గురువంటే రామకృష్ణుడు. శిష్యుడంటే వివేకానందుడు అలా ఉద్భవించారు. ప్రజలు విద్యకు, విజ్ఞానానికి దూరంగా మూఢవిశ్వాసాలకు ,దారుణ సాంఘిక దురాచార కబంధహస్తాల్లో నలిగి పోవడం చూడలేక చైతన్యదీప్తి రగించాడు. ఉప నిషత్తులు, జైన, బౌద్ధ మతాలు విలసిల్లి ప్రపంచానికి శతాబ్దాలపాటు జ్ఞాన కాంతులు ప్రసరించిన భారతదేశం కాల వైపరీత్యాలకు లోనై ఔన్నత్యాన్ని కోల్పోయిం దని వివేకానందుడు గ్రహించాడు. శ్రామికులు, స్త్రీల పట్ల అంతులేని వివక్షత కొనసాగుతుందని, యువత నిస్తేజంగా మారిపోయిందని, నైతికంగా, భౌతికంగా భారత జాతి నిర్వీర్యం అయిందని గ్రహించాడు. భారతీయ మూలాల నుండి నిజమైన వేదాంత దృక్పథాన్ని రూపొందించి, జాతిమత పరమైన అన్ని రకాల అధిపత్యాలను, రూపుమాపే ప్రజాస్వామిక సిద్ధాంతంగా మార్చాడు. 1893లో చికాగో నగరంలో ప్రపంచ మత సదస్సుకు హాజరై భారతీయ తత్వసారాన్ని అద్భుత రీతిలో తెలియజేసి, ప్రపంచాన్ని ఆకట్టు కున్నాడు. ఆయన ప్రవచించిన సూక్తులు, చూపిన మార్గంలో యువత నడిచి దేశాన్ని బలోపేతం చేసేందుకు ముందుకు సాగాల్సిన ఉంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# నేడు మానుకోటకు సిఎం కెసిఆర్

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

**మహబూబాబాద్,జనవరి11(సమసమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ మహబూబాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి , గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ శ్రీమతి మాలోతు కవిత బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని, జిల్లా పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లతో పాటు వసతులను, హెలిప్యాడ్ నిర్మాణాన్ని జడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు, ఎమ్మెల్యే శంకర్ నాయక్ తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి, ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. మంత్రులతో పాటు కలెక్టర్ శశాంక, ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు ఉన్నారు.





## ఉపాధ్యాయ డైరీని ఆవిష్కరించిన గవర్నర్

**హైదరాబాద్,జనవరి11(సమసమాజం):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2023 డైరీని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యా, ఉపాధ్యాయుల కొన్ని సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్ రావు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రతి పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు నిర్వహించాలని కోరారు. ఉ.0.317 బాధితులను సమస్యలను పరిష్కరించాలని, జీతాల చెల్లింపులో నమ్మశక్యం కాని జాప్యం జరుగుతుందని.. ప్రతి నెలలో ఒకటో తేదీ నాడు జీతాలు చెల్లించాలని వివరించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి పెండింగ్ బిల్లులు, సరెండర్, ఉఖఈ లోన్‌లు, పార్ట్ ౧÷నైల్, ౧÷నైల్ పేమెంట్- -రిటైర్‌మెంట్ ప్రయోజనాలు నెలల తరబడి నిరీక్షించవలసి వస్తుందని అన్నారు. కొన్నిసార్లు ఏడాది కూడా అవుతుందని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశామని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ంఃఖాఓ ప్రతినిధి సూరం విష్ణు వర్దన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు అయిల్నేని నరేందర్ రావు లు పాల్గొన్నారు.



## బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి) సమయంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్ లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతి చెందారు. తెలంగాణ గ్రేహౌండ్స్ సీఆర్పీఎఫ్ కోబ్రా ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. హిడ్మా లక్ష్యంగా ప్రత్యేక హెలికాప్టర్‌లో సర్జికల్ స్ట్రైక్ చేశారు. బీజాపూర్- తెలంగాణ సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు చెబుతున్నారు. హిడ్మాపై రూ. 45 లక్షల రివార్డు ఉంది. అయితే హిడ్మా ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టు కేంద్ర కమిటీ ధ్రువీకరించలేదు. కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా ఉన్న హిడ్మాకు నాలుగంచెల భద్రత ఉంటుంది. ఈ భద్రతను చేధించుకుని పోలీసులు హిడ్మా ఆపరేషన్‌ను సక్సెస్ చేసినట్లు తెలుస్తోంది. హిడ్మా భద్రత దళాలకు మోస్ట్ వాంటెడ్. దండకారణ్యంలో జరిగే ప్రతి దాడి వెనుకా ఆయన హస్తం ఉంటుందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

## అంబానీ పాఠశాలకు బాంబు బెదిరింపు

### తనిఖీ చేసి ఉత్తుత్తి కాల్గఆ గుర్తింపు

ముంబై,జనవరి11(ఆర్ఎన్ఎ): ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి చెందిన బాంద్రా కుర్లా ప్రాంతంలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ పాఠశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మంగళవారం సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఆగంతకుడు పాఠశాల ల్యాండ్‌లైన్ నంబర్‌కు కాల్ చేశాడు. పాఠశాలలో టైం బాంబు పెట్టామని చెప్పి వెంటనే కాల్ కట్ చేశాడు. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. అప్రమత్తమైన పోలీసులు పాఠశాలలో తనిఖీలు చేపట్టగా ఎలాంటి బాంబు కనిపించలేదు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఫోన్ కాల్ ఆధారంగా ఆగంతకుడిని విక్రమ్ సింగ్‌గా గుర్తించామని.. త్వరలోనే పట్టుకుని అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కాగా, గతంలోనూ అంబానీ కుటుంబానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. 2020లో ముంబయిలోని అంబానీ ఇంటి సమీపంలో పేలుడు పదార్థాలతో కూడిన ఓ కారు నిలిపిఉంచడం అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే. మరో ఘటన.. రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న హర్‌కిసాన్‌దాస్ ఆసుపత్రికి గతేడాది అక్టోబర్‌లో ఫోన్ చేసిన గుర్తు తెలియని ఆగంతకుడు అంబానీ కుటుంబాన్ని బెదిరించాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నంబరు ఆధారంగా ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. తాజాగా ఇప్పుడు అంబానీ పాఠశాలకు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

## శ్రీశైలం లడ్డూ తయారీ సరుకుల్లో గోల్‌మాల్

### అధికధరలకు నాసిరకం సరుకులు సరఫరా

### విచారణలో గుర్తించామన్న ఛైర్మన్ చక్రపాణి రెడ్డి



**నంద్యాల, జనవరి 11 (సమ సమాజం)** శ్రీశైలం క్షేత్రంలో భారీ అవినీతి జరిగింది. లడ్డూ తయారీ సరుకుల కొనుగోలులో ఒక్కనెలలో లక్షల రూపాయల గోల్ మాల్ జరిగింది. నవంబర్ నెలలో లడ్డూ తయారీ సరుకుల రేట్లలో రూ. 42 లక్షల వ్యత్యాసాలు జరిగినట్లు గమనించామని చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ లడ్డూ తయారీ సరుకులు సెకండ్ క్వాలిటి దేవస్థానానికి సరఫరా చేస్తున్నారని, మార్కెట్ రేట్లకంటే అధికంగా దేవస్థానానికి సరుకులు ఇస్తున్నారని తమ అంతర్గత విచారణలో వెల్లడైందన్నారు. లడ్డూ తయారీ అధిక రేట్ల సరుకుల విషయమై దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం దేవస్థానానికి లడ్డూ తయారీ సరుకులు ఇస్తున్న కాంట్రాక్టు రద్దు చేయాలని గత నెలలో జరిగిన ట్రస్ట్ బోర్డు మీటింగ్‌లో బోర్డు ఆమోదం తెలిపిందని చక్రపాణిరెడ్డి తెలిపారు. కానీ ఇంతవరకు కాంట్రాక్టు రద్దు కాలేదన్నారు. కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాలేదని, అందుకే కాంట్రాక్టు రద్దు చేయలేదని ఈవో లవన్న చెప్పారన్నారు. శ్రీశైలం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని స్పష్టంగా కనబడుతోందన్నారు. ఫిబ్రవరి, మార్చి రెండు నెలలకు పోల్చి చేసుకుంటే కనీసం కోటి రూపాయలు తెడా వచ్చే అవకాశం ఉందని చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు.

## ప్రేమికురాలి బంధువుల బెదిరింపులు

### దళితయువకుడి ఆత్మహత్య

**నంద్యాల, జనవరి 11 (సమ సమాజం)** దొర్నిపాడు మండలం, చాక రాజువేములలో విషాదం నెలకొంది. ప్రేమికురాలి తల్లిదండ్రుల బెదిరింపులతో దళిత యువకుడు ప్రసన్నకుమార్ (24) విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మలమడుగుకు చెందిన ఓ యువతిని ప్రసన్నకుమార్ ప్రేమించాడు. ఈ ప్రేమ వ్యవహారం ప్రియురాలి తల్లిదండ్రులకు తెలిసింది. తమ అమ్మాయిని మర్చిపోవాలని లేదంటే చంపేస్తామని యువకుడికి వార్నింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపం చెందిన ప్రసన్నకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు యువతి తల్లిదండ్రులతో పాటు మరో ఇద్దరిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ కొత్త సిఎస్‌గా శాంతికుమారి

# ప్రభుత్వ పథకాలను సమర్థంగా ముందుకు తీసుకువెళతా

### సిఎం కెసిఆర్ సిఎస్‌గా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది

### ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎస్

### సిఎస్‌ను కలిసి అభినందించిన డిజిపి అంజనీకుమార్



**హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయని, వాటిని మరింత సమర్థంగా ముందుకు తీసుకుని వెళ్లడానికి కృషి చేస్తానని కొత్త సిఎస్‌గా బాద్యతలు చేపట్టిన శాంతికుమారి అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం ఇవ్వడం పట్ల సీఎం కేసీఆర్‌కు సీఎస్ శాంతి కుమారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొలి మహిళా సీఎస్‌గా బాధ్యతల స్వీకరణ సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలతో పాటు అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సహచర అధికారులతో సమన్వయంతో, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతంగా అమలు చేయడానికి కృషిచేస్తాను అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ శాంతి కుమారి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా భాద్యతలు స్వీకరించిన శాంతి కుమారి డీజీపీ అంజనీ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తాత్కాలిక సచివాలయం బీఆర్‌కే భవన్‌లో శాంతి కుమారి సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రగతి భవన్ నుంచి బీఆర్‌కే భవన్‌కు చేరుకున్న శాంతి కుమారికి సీఎస్ ఓఎస్‌డీ విద్యాసాగర్ స్వాగతం పలికారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శాంతి కుమారి.. సీఎస్‌గా 2025, ఏప్రిల్ వరకు కొనసాగనున్నారు. ఎమ్మెస్సీ మెరైన్ బయాలజీ చదివిన శాంతి కుమారి అమెరికాలో ఎంబీఏ కూడా పూర్తి చేశారు. గత మూడు దశాబ్దాలుగా ఐఏఎస్‌గా పేదరిక నిర్మూలన, సమ్మిళిత అభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్య రంగాలు, స్కిల్ డెవలప్‌మెంట్, అటవీశాఖల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాల్లో రెండేళ్లపాటు పనిచేశారు. గతంలో నాలుగేళ్లపాటు సీఎం కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా, టీఎస్ ఐపాస్‌లో ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ స్పెషల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. శాంతికుమారి ప్రస్తుతం అటవీశాఖలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.



## బాలింతలకు ఇన్‌ఫెక్షన్

### ఆస్పత్రిని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ లత

**జగిత్యాల, జనవరి 11 (సమ సమాజం):** జిల్లా మాతా శిశు ఆస్పత్రి లో ఆరుగురు బాలింతలకు ఇన్ఫెక్షన్ సోకింది. ఈ నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత సందర్శించి, బాధితుల పరిస్థితిని తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఆరు గురు గర్భిణీలకు డెలివరీ తర్వాత వేసిన కుట్లకు ఇన్ఫెక్షన్ సోకడంతో బందువులు ఆందోళనకు దిగారు. ఈ ఇన్ఫెక్షన్ కు కారణం డాక్టర్స్ నిర్లక్ష్యమే కారణమంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే డెలివరీ అయ్యాక డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్ళిన తర్వాత కుట్లకు చీము వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైనట్టు బాధితుల తరపు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తిరిగి ఆస్పత్రికి వస్తే వైద్యులు పట్టించుకోవడం లేదని బాధితుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ ఘటన పై స్పందించిన అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత.. ఆస్పత్రికి చేరుకొని బాధితుల ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులకు గురైన బాలింతలకు స్పెషల్ ట్రీట్మెంట్ ఇవ్వాలని సంబంధిత డాక్టర్లకు సూచించామన్నారు. సిజేరియన్ అయిన పేషెంట్లకు ఇన్ఫెక్షన్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రసూతి నుండి తగిన జాగ్రత్తల గురించి గర్భిణులకు హాస్పిటల్స్ సిబ్బంది ద్వారా తెలపాలని డాక్టర్లకు సూచనలు చేశారు.

## ప్రధాని మోడీ పర్యటన వాయిదా

(మొదటి పేజీ తరువాయి) ప్రధానమంత్రి కార్యాలయం పీఎంవో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సమాచారం అందించింది. ప్రధాని పర్యటన మళ్లీ ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ప్రధానమంత్రి మోదీ ఈ నెల 19న హైదరాబాద్‌కు రావాల్సి ఉంది. దీంతో రాష్ట్రానికి వందే భారత్ రైలు రాక మరింత ఆలస్యం కానుంది. ఈ నెల 19న సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రధాని మోదీ.. రైలుకు పచ్చజెండా ఊపాల్సి ఉంది. అయితే ప్రధాని హైదరాబాద్ పర్యటన వాయిదా పడటంతో ఈ అత్యాధునిక రైలు వర్చువల్‌గా ప్రారంభం కానుంది. వందే భారత్ రైలుతోపాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను కూడా మోడీ ప్రారంభించాల్సి ఉంది. అదేవిధంగా సికింద్రాబాద్–విజయవాడ మధ్య రైల్వే ఆధునీకరణ పనులకు శంఖుస్థాపన, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి సంబంధించిన పనులను శ్రీకారం చుట్టాల్సి ఉంది. అయితే మోదీ పర్యటన రద్దువడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## ఆంధ్రా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

(మొదటి పేజీ తరువాయి) రెండు మూడు నెలల ముందు నుంచే ఇందుకు సన్నద్ధం అవుతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి పెద్ద పండుగ సంక్రాంతి కావడంతో ఇప్పటి నుంచే అక్కడికి తరలి వెళ్లేందుకు హైదరాబాద్‌లో ఉన్న వారు ఇప్పటికే తరలి వెళ్లడంతో హైదరాబాద్ దాదాపుగా ఖాళీగా కనిపిస్తోంది. వేలాదిమందది ఇప్పటికే ఊరిబాట పట్టారు. ఆర్టీసీ కూడా ఇదే అదనుగా ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాలకు అనుగుణంగా లగ్జరీ బస్సులను తెలంగాణ ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ కు చెందినవాళ్లు ఎక్కువగా సెటిల్ అయ్యి ఉండటంతో.. ఎక్కువగా జంట నగరాల నుంచి ఏపీకి పయనం అవుతుంటారు. ఈ పండగ సీజన్ దగ్గర పడటంతో ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.. ఈ సంక్రాంతి పండుగకు ఒక్క విశాఖ మీదుగా లక్షన్నర మంది ప్రయాణికులు.. తమ గ్రామాలకు వెళ్తారని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్లుగా బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర వాళ్లు ఎక్కువగా హైదరాబాద్ లో సెటిల్ కావడంతో.. హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు రంగం సిద్ధం చేశారు. హైదరాబాద్ తో పాటు బెంగళూరు, చెన్నై నుంచి కూడా ప్రయాణికులు వస్తారని భావిస్తున్నారు. అవసరమైతే అదనపు బస్సులు కూడా వేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆన్ లైన్ లో టిక్కెట్ల విక్రయం ప్రారంభమైంది. ఆర్టీసీ కాంప్లెక్సులోని ప్రత్యేక కౌంటర్లలో టిక్కెట్లు జారీ చేస్తున్నారు. విశాఖ నుంచి విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, శ్రీకాకుళం, టెక్కలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. అయితే సరైన సమయంలో బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు ప్రయాణీకులు. సమయానికి ఆర్టీసీ బస్సులు రాక.. ప్రైవేట్ బస్సులు దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న అదనపు బస్సులతో ఆదాయం కూడా పెరిగిందన్న భావనలో ఆర్టీసీ ఉంది.

## కృష్ణాజలాల వాటా తేల్చండి

(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వం తెచ్చిన గెజిట్ ను ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా కోదండరాం వాదించారు. కృష్ణా నదీ జలాల వాటా సాధనలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతామని హెచ్చరించారు. కృష్ణా పరీవాహిక ప్రాంతంలో టీజేఎస్ యాత్ర నిర్వహించి వివిధ నిరసన కార్యక్రమాలు చేశామని కోదండరాం చెప్పారు. ఉద్యమాన్ని తీవ్రం చేయుటలో భాగంగా ఈ దీక్ష చేస్తున్నామన్న ఆయన.. కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ బృందం ఈ నెల 30, 31వ తేదీల్లో ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను, కృష్ణా, గోదావరి బోర్డు అధికారులను కలుస్తామని స్పష్టం చేశారు.

## మాకు పట్టిన గతే మీకు పట్టింది

(మొదటి పేజీ తరువాయి) మీకు వచ్చిందని.. సోమేశ్ పై సెటైర్లు వేశారు. మీకు కర్మ సిద్ధాంతం అంటే ఎంటో తెలుసా అంటూ సోమేశ్ కుమార్ ను ఉద్దేశిస్తూ తిరుపతి రావు సెటైర్లు వేశారు. అప్పట్లో కోర్టు తమకు ఏ తీర్పు ఇచ్చిందో ఇపుడు మీకు కూడా అదే తీర్పు ఇచ్చిందంటూ విమర్శించారు. మీరు తమను బలవంతంగా ఏ విధంగా బదిలీ చేశారో కోర్టు మిమ్మల్ని కూడా అలాగే బదిలీ చేసిందని.. దీనినే కర్మ సిద్ధాంతం అంటారని లేఖలో పేర్కొన్నారు. మనం ఎవ్వరిని ఇబ్బంది పెట్టొద్దని.. అలా చేస్తే ఎప్పుడో ఒకప్పుడు మనం కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని సెటైర్ వేశారు తిరుపతి రావు. ఇపుడు ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం!





(మొదటి పేజీ తరువాయి) ఊళ్లకు బయలుదేరారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రహెచ్చరించారు. 'సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని,ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. ఈ విషయంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలన్నారు. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలన్నారు. ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్, పాల వారిని రావద్దని చెప్పాలన్నారు. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. వాచ్ మెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలి. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటి కి సంబంధించిన నాణ్యమైన సిసిటివి లు అమయర్చుకోవాలన్నారు. ఇంటి భద్రతా పరంగా ఇంటికి దృఢమైన, నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ గోద్రెజ్ హై సెక్యూరిటీ లాక్ సిస్టం ని వాడడం మంచిది. తాళం వేయడం కంటే గోద్రెజ్ డోర్ లాక్ చేయడం వల్ల ఇంట్లో మనుషులు ఉన్నారా? లేరా? అనేది తెలియదు. సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచెల భద్రతనిస్తుంది. ఇంట్లో, ఇంటి బయట మోషన్ సెన్సర్‌లను ఉపయోగించడం మంచిది. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించండి. ఇవి చీకటి ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. సెన్సార్లు పరిసరాల్లో ఏదైనా కదలిక గుర్తించగానే లైట్ వెలుగుతుంది. ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నెంబర్ దగ్గర పెట్టుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం కాగలదని సిపి అన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్‌మెన్ ను నియమించుకోవాలి. రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వచ్చినా వారి వివరాలు తెలుసుకుని రిజిస్టర్‌లో నమోదు చేసుకోవడం మంచిదని అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లకు తెలపాలి. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)దుతున్నదని ఆరోపించారు. 1961 నుంచి 2021 వరకు ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను పెంచలేదని వెల్లడించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా రాష్ట్రంలో దళితబంధు, గిరిజన బంధు అమలుచేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ మోడల్‌గా దేశవ్యాప్తంగా దళిత, గిరిజన బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణపై మంచుదుప్పటి

### పొగమంచుతో వాహనదారుల ఇక్కట్లు

హైదరాబాద్,జనవరి11(సమసమాజం): రాష్ట్రంపై మంచు దుప్పటి కప్పేసింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తెల్లవారుజామున దట్టంగా పొగమంచు కురియడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజలు చలిని తట్టుకోవడానికి మంటలు కాచుకున్నారు. రాష్ట్రంలో అతితక్కువగా రంగారెడ్డి జిల్లాలోని మంగల్‌పల్లిలో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇక కుమ్రంభీ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 7.6, లింగాపూర్‌లో 7.7, రంగారెడ్డి జిల్లాలోని చుక్కాపూర్‌లో 7.7, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో 7.8, కామారెడ్డి జిల్లా డోంగ్లిలో 7.9, రంగారెడ్డి జిల్లా తల్లపల్లిలో 8.1, వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 8.2, ఆదిలాబాద్ జిల్లా భోరజ్‌లో 8.5, కుమ్రంభీ జిల్లా తిర్యానిలో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మాల్చెల్మాలో 9.5 డిగ్రీలు, గౌరారంలో 10.4 డిగ్రీలు, ధర్మారంలో 11.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

## విద్యార్థులకు అవగాహనా సదస్సులో మంత్రి సబిత

రంగారెడ్డి,జనవరి11(సమసమాజం): రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటు న్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. విద్యా సంస్థల్లోకి మాదక ద్రవ్యాలు క్రమంగా చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూలు, కాలేజీ అమ్మాయిలను వేధించేందుకు ఆకతాయిలు ఎన్నో రకాలుగా వ్యవహరిస్తుంటారని, బాధిత అమ్మాయిలు షీ టీమ్ లకు ఫిర్యాదు చేస్తే నిందితులపై వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో కాలేజీల్లో ర్యాగింగ్ లు ఉండేవని, కానీ, ఇప్పుడు ర్యాగింగులు లేవన్నారు. ప్రజలు రాత్రి వేళ తమ ఇండ్లల్లో హాయిగా నిద్ర పోతున్నారంటే దానికి పోలిసులే కారణమని అన్నారు. శాంతి భద్రతలు కాపాడంతో పాటు, సామాజిక కార్యక్రమాల్లోనూ పోలీసులు తమ వంతు పాత్ర పోషించడం అభినందనీయం అని చెప్పారు. మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో యాంటీ డ్రగ్ అవేర్ నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ప్రారంభంలో ఆనందం ఇచ్చినా.. క్రమంగా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోతారని చెప్పారు. సెల్ ఫోన్లను కూడా అవసరం మేరకే ఉపయోగించాలని సూచించారు. యువతీ, యువకులు గంటల తరబడి సెల్ ఫోన్లు వాడితే చాలా సమస్యలు వస్తాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో ఫ్రెండ్ షిఫ్ చేయొద్దని చెప్పారు. మాదక ద్రవ్యాలు, సైబర్ మోసాలపైనా రాచకొండ కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.


## చిరు వ్యాపారులకు జగన్ సర్కార్ అండ

(మొదటి పేజీ తరువాయి) డబ్బులు జమ చేశారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వడ్డీలేని రుణం.. మొత్తం రూ.395 కోట్లను విడుదల చేశారు. జిల్లాల నుంచి మంత్రులు, కలెక్టర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు. సీఎం కొంతమంది లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తన పాదయాత్ర సమయంలో చిరు వ్యాపారుల కష్టాలు చూశానని.. అప్పుడే వారికి ఏదైనా మంచి చేయాలని భావించానన్నారు. చిరు వ్యాపారుల కష్టాలు తీర్చేందుకు జగనన్న తోడు పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే లబ్ధిదారుల వడ్డీ భరిస్తుంది అన్నారు జగన్. ఇంకా ఏవరైనా అర్హత ఉండి కూడా పథకం అందకపోతే.. వారికి కూడా లబ్ది చేకూరుస్తామన్నారు. జగనన్న తోడు పథకం చిరు వ్యాపారుల జీవనోపాధికి ఉపయోగపడుతోందని.. వ్యాపారులకు పెట్టుబడికి కష్టం రాకూడదనే ఇలా రుణం అందజేస్తున్నామన్నారు. చిరు వ్యాపారులకు ఒక్కొక్కిరికి రూ.10వేల చొప్పున ఎలాంటి గ్యారెంటీ లేకుండానే రుణం అందిస్తున్నామన్నారు. 3.95 లక్షల మంది చిరు వ్యాపారులకు కొత్తగా రూ.395 కోట్ల రుణాలు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 15,31,347 మందికి.. రూ.2,406 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు తెలిపారు. గత ఆరు నెలలకు సంబంధించి రూ.15.17 కోట్లు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేశామని చెప్పారు. లబ్ధిదారుల్లో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగనన్న తోడు పథకానికి సీఎం జగన్ బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. ప్రభుత్వం చేతివృత్తుల కళాకారులకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, అదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి రుణాలు, వడ్డీ మాఫీ నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. బ్యాంకుల ద్వారా కొత్తగా రూ. 395 కోట్లు కొత్త రుణాలు మంజూరు చేశామన్నారు. గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ విడుదల చేశామని, సకాలంలో రుణాలు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందన్నారు. రూ. 3.67 లక్షల మంది రెన్యువల్‌గా రుణాలు తీసుకుంటుండగా.. 28 వేల మందికి కొత్తగా రుణాలిస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. జగనన్న తోడు ద్వారా వ్యాపారాలు చేసుకునేందుకు ఏ ఒక్కరిపై ఆధారపడకుండా వడ్డీలేని రుణాలు ఇస్తున్నామన్నారు. చిరు వ్యాపారులు తమకు ఉపాధి కల్పించడమే కాకుండా సమాజానికి గొప్ప మేలు చేస్తున్నారని, చిరువ్యాపారులు వారు బతకడమే కాకుండా గొప్ప స్వయం సహాయక వ్యవస్థను తీసుకువచ్చారని కొనియాడారు. చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి ఎలాంటి గ్యారెంటీ లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలిస్తున్నామని, తీసుకున్న డబ్బును సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు తిరిగి రుణాలు ఇస్తాయని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకంలో చేరాలంటే.. ఆయా గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హత కలిగిన రూ.10 వేల రుణం లభిస్తుంది. గ్రామ వాలంటీర్‌ను సంప్రథించినా పథకానికి సంబంధించిన వివరాలు ఇస్తారు. ఈ పథకం కింద చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, చేతి వృత్తులు వారు ప్రయోజనం పొందొచ్చు. కుటుంబ ఆదాయం గ్రామాల్లో అయితే రూ.10 వేలకు లోపు, పట్టణాల్లో రూ.12 వేలులోపు ఉండాలి. విద్యుత్ వినియోగం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. ఒకవేళ షాపు ఉంటే కనుక రిజిస్ట్రేషన్ పత్రం కావాలి.. పొలం 10 ఎకరాలకు లోపు ఉండాలి. ఈ అర్హతలు ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద రూ.10వేల రుణం అందిస్తోంది. గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల సర్వే నిరంతర సామాజిక తనిఖీ కోసం అర్హుల జాబితా గ్రామ/వార్డు సచివాలయల్లో ప్రదర్శిస్తారు. పథకాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేశారు. అలాగే అర్హతలు ఉండి జాబితాలో పేరులేనివారు గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కారం చేస్తారు.

## జమ్మూకాశ్మీర్‌లో విషాదం

### లోయలోజారిపడి ముగ్గురు జవాన్ల మృతి

శ్రీనగర్,జనవరి11(సమసమాజం): జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో విషాదం చోటు చేసుకున్నది. జిల్లాలోని మాచల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి పెట్రోలింగ్ చేస్తున్న ముగ్గురు సైనికులు లోయలో జారిపడి మరణించారు. బుధవారం ఉదయం లైన్ ఆఫ్ కంట్రోల్ వెంబడి పెట్రోలింగ్ చేస్తుండగా చినార్ క్రాప్స్‌కు చెందిన జేసీఓతోపాటు మరో ఇద్దరు సైనికులు లోయలోకి జారిపడ్డారని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ట్రాక్‌పై దట్టమైన మంచు కురవడంతో ఈ ఘటన జరిగిందని చెప్పారు.



## హైదరాబాద్ చేరుకున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ థాక్రే



(మొదటి పేజీ తరువాయి) స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన వీహెచ్‌ను అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించారు. దాంతో ఆగ్రహించిన వీహెచ్.. సెక్యూరిటీతో వాగ్వాదానికి దిగారు. అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆ తరువాత విషయం తెలుసుకున్న ఇతర నేతలు అక్కడికి రావడంతో పరిస్థితి సద్దుమణిగింది. హైదరాబాద్‌లో దిగిన తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇంచార్జ్ మాణిక్ రావు థాక్రే వెంటనే యాక్షన్‌లోకి దిగారు. అసంతృప్తిలో ఉన్న సీనియర్ లీడర్లకు ఫోన్లు చేస్తున్నారు. మొదటగా ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఫోన్ చేశారు. గాంధీభవన్‌కు రావాలని ఆహ్వానించారు. అయితే మాణిక్ వినతిని తిరస్కరించిన కోమటిరెడ్డి గాంధీభవన్ బయటే కలుస్తానని తేల్చి చెప్పారు. కాగా, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి అస్తవ్యవస్థంగా మారింది. పార్టీలో ఎవరికి వారే టాప్ లీడర్లు అని భావిస్తూ, పంతాలకు పోవడం వల్ల పరిస్థితి ఆగమాగం ఉంది. కేడర్ ఉన్నా.. లీడర్స్ సరిగా లేకపోవడంతో అధికారం కల్లగానే మారింది. అయితే, ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ కాంగ్రెస్‌కు ఇప్పటి వరకు రెండుసార్లు ఇంఛార్జీలను మార్చింది పార్టీ అధిష్టానం. మొదట కుంతియా ఉండగా.. ఆయన స్థానంలో మాణిక్యం ఠాగూర్‌ను నియమించారు. అయన కూడా నేతలను ఏకతాటిపైకి తీసుకురాలేకపోయారు. చివరకు సీనియర్ నేతల అసమ్మతి ఎక్కువ అవడంతో.. ఆయన సైతం తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలోనే ఇప్పుడు మాణిక్‌రావు థాక్రే నూతన ఇంఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. థాక్రే నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్లనుంది తెలంగాణ కాంగ్రెస్. మహారాష్ట్ర మాజీ పీసీసీ చీఫ్‌గా పని చేసిన థాక్రేకి కూసింత రాజకీయ అనుభవం ఎక్కువేనట. మరి థాక్రే అయినా తెలంగాణ కాంగ్రెస్‌ను గాడిన పెడతారా ముఖ్య నాయకులతో థాక్రే ముఖాముఖి ఫలిస్తుందా లేక పాత కథలాగే ఫిర్యాదుల పరంపరంతో కాలం గడిచిపోతుందా ఏం జరుగనుంది అనేది ఆసక్తిగా మారింది.

## టీఎస్‌పీఎస్సీ ముందు గురుకుల పిఈటి అభ్యర్థుల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి) వరకు తమకు ప్రభుత్వం పోస్టులు కేటాయించలేదని అవేదన చెందారు. దీనిపై స్పందించిన టీఎస్‌పీఎస్సీ అధికారులు మాట్లాడుతూ.. గతంలో కోర్టు కేసులతో పోస్టులు కేటాయించలేక పోతున్నామన్నారు. అయితే కోర్టు కేసులు క్లియర్ అయినా టీఎస్‌పీఎస్సీ పోస్టింగ్‌లు ఇవ్వడం లేదని అభ్యర్థులు ఆరోపించారు. న్యాయపరంగా తమకు పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ అధికారులు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చే వరకు కార్యాలయం ముందు నుంచి కదలమని బాధితులు స్పష్టం చేశారు. ఉద్యోగం వచ్చిన సంతోషం కూడా కోల్పోయామని అవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ అధికారులు పోస్టింగ్‌లు ఇవ్వకుంటే సీఎం క్యాంప్ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తామని బాధితులు స్పష్టం చేశారు.

## గాంధీభవన్‌కు రాలేను: కోమటిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి) నిరాకరించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన మాణిక్ ఠాక్రే తొలిసారిగా నేడు హైదరాబాద్‌కు వచ్చారు. పార్టీ నేతలతో ఒక్కొక్కరిగా సమావేశమవుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న ఎంపీ కోమటిరెడ్డికి ఆయన ఫోన్ చేశారు. గాంధీ భవన్‌కు రావాలని, సమస్యలపై చర్చించుకుందామని ఆహ్వానించారు. అయితే ఎంపీ కోమటిరెడ్డి దానికి తిరస్కరించారు. తాను గాంధీ భవన్‌కు రాలేనని చెప్పారు. బయట కలుస్తానని ఠాక్రేకు ఫోన్‌లో తెలిపారు. మునుగోడు ఉపఎన్నిక సమయం నుంచి ఆయన పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీతో కూడా ఆయన భేటీ అయ్యారు. దీంతో తమ్ముడు రాజగోపాల్ రెడ్డి బాటలోనే ఆయన కూడా పయణించనున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈనేపథ్యంలో ఆయనను మాణిక్ ఠాక్రే పిలవడం హాట్‌టాపిక్‌గా మారింది.

# సచిన్‌తో కోహ్లీని పోల్చడం సరికాదు

### మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ వ్యాఖ్య



న్యూఢిల్లీ,జనవరి11(సమసమాజం): శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ సెంచరీతో చెలరేగి తొలి మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడి, 87 బంతుల్లో 12 ఫోర్లు ఒక సిక్సర్ సాయంతో 113 పరుగులు సాధించాడు. దీంతో అందరూ కోహ్లీని అభినందిస్తున్నారు. వన్డే ఫార్మాట్‌లో 45వ సెంచరీని సాధించాడు. అదే సమయంలో శ్రీలంకపై తొమ్మిదో సెంచరీని సాధించి.. క్రికెట్ దిగ్గజం సచిన్‌ను అధిగమించాడు. ఈ క్రమంలో అందరు విరాట్ కోహ్లీని సచిన్‌తో పోలుస్తున్నారు. అయితే మాజీ డ్యాషింగ్ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్ లెజెండ్ సచిన్‌ను విరాట్‌తో పోల్చడంపై మండిపడ్డాడు. కోహ్లీ ఆట తీరును ప్రశంసించిన గౌతీ.. సచిన్ కాలంలో పరుగులు చేయడం చాలా కష్టమని తెలిపాడు. ఎందుకంటే అప్పట్లో ఫీల్డింగ్ నిబంధనలు బ్యాటర్‌కు అనుకూలంగా ఉండేవి కావని పేర్కొన్నాడు. 30 యార్డ్స్ సర్కిల్ వెలుపల 5 కంటే ఎక్కువ మంది ఆటగాళ్లు ఉండేవారని.. కాబట్టి బౌండరీలు కొట్టడం చాలాకష్టమని.. అందుకే సచిన్ గ్రేట్ అన్నాడు. విరాట్ కోహ్లీని సచిన్‌తో పోల్చడం సరికాదంటూ వ్యాఖ్యానించాడు. అలాగే భారత్‌పై శ్రీలంక బౌలింగ్ సాధారణంగా ఉందని, శ్రీలంక బౌలింగ్ నాకు చాలా నిరాశ పరిచిందని పేర్కొన్నాడు. గంభీర్ వ్యాఖ్యలపై కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

# కోహ్లీ సెంచరీకి థ్రిల్ అయిన లారా

### తాను ముందే ఊహించానన్న విండీస్ దిగ్గజం



న్యూఢిల్లీ,జనవరి11(సమసమాజం): శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో కోహ్లీ అంతర్జాతీయ మ్యాచుల్లో 73వ సెంచరీ నమోదు చేశాడు. ఆ వన్డేలో కోహ్లీ 113 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే కోహ్లీ ఆటతీరుపై మాజీ క్రికెటర్ బ్రియాన్ లారా థ్రిల్ అయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో లారా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేశాడు. నిజానికి వన్ డౌన్‌లో కోహ్లీ బ్యాటింగ్‌కు వచ్చాడు. అయితే ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు రోహిత్, గిల్‌లు తొలి వికెట్‌కు 143 రన్స్ జోడించారు. ఆ సమయంలో కోహ్లీ డగౌట్‌లో కూర్చున్నాడు. డగౌట్‌లో కూర్చున్న కోహ్లీ ఫోటోను లారా తన ఇన్‌స్టా స్టోరీలో పోస్టు చేశాడు. బ్యాటింగ్ కోసం కోహ్లీ ఎలా ఎదురుచూస్తున్నాడో.. అలాగే తాను కూడా కోహ్లీ ఆటను చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు లారా ఆ ఫోటోపై కామెంట్ చేశారు. కోహ్లీ బ్యాటింగ్ పూర్తి అయ్యే వరకు ఎదురుచూస్తానని లారా అన్నారు. ఇక చివరకు కోహ్లీ సెంచరీ చేసిన తర్వాత సంతోషంలో తేలిపోయాడు. 45వ వన్డే సెంచరీని అతను సెలబ్రేట్ చేసుకున్నాడు. సెంచరీ చేసి బ్యాట్ ఎత్తిన కోహ్లీ ఫోటోను పోస్టు చేసి.. దానిపై కూడా లారా కామెంట్ చేశారు. ఇది మార్నింగ్ రన్ అంటూ విండీస్ దిగ్గజ బ్యాటర్ పేర్కొన్నారు.

# బుల్లెట్‌లా దూసుకుపోతున్న ఉమ్రాన్ బంతులు

### 156 కిలోమీటర్ల వేగంతో బంతి విసిరి రికార్డు



ముంబై,జనవరి11(సమసమాజం): టీమిండియా స్పీడ్ స్టర్ ఉమ్రాన్ మాలిక్ దూకుడుకు సాటి లేరన్న విషయం రుజువు చేసుకున్నాడు. అతని బుల్లెట్ బంతులను అడ్డుకోవడం అసాధ్యమన్న రీతిలో చెలరేగుతున్నాడు. ఐపీఎల్ లో దుమ్మురేపి టీమిండియా తలుపు తట్టిన ఉమ్రాన్ మాలిక్..అంతర్జాతీయ వేదికపై కూడా రెచ్చిపోతున్నాడు. వేగంతో బ్యాట్స్ మన్ ను ఉక్కిరిబిక్కిరి చేసే ఉమ్రాన్..ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నాడు. తాజాగా లంకతో జరిగిన తొలి వన్డేలో అరుదైన రికార్డు సృష్టించాడు. గౌహతి వేదికగా లంకతో జరిగిన ఫస్ట్ వన్డేలో ఉమ్రాన్ మాలిక్ 156 కిలోమీటర్ల వేగంతో బంతి విసిరాడు. లంక ఇన్నింగ్స్ 14వ ఓవర్ లోనాలుగో బంతి వేగం స్పీడో మీటర్ లో గంటకు 156 కి.మీ.ల వేగంతో వచ్చింది. దీంతో టీమిండియా తరపున అత్యధిక వేగంతో బంతి విసిరిన మూడో బౌలర్ ఉమ్రాన్ రికార్డులకెక్కాడు. భారత్ తరపున అత్యధిక వేగంతో బంతులు సంధించిన జాబితాలో టెస్టుల్లో డేవిడ్ జాన్సన్ 1996లో ఆస్ట్రేలియాపై 157.8 కి.మీ వేగంతో బంతిని విసిరాడు. ఇక వన్డేలలో జవగల్ శ్రీనాథ్ 1997లో జింబాబ్వేపై గంటకు 157 కి.మీ. వేగంతో బాల్ వేశాడు. ఆ తర్వాత 156 కి.మీతో ఉమ్రాన్ మాలిక్ నిలిచాడు. అటు టీ20ల్లో మాత్రం 155 కి.మీతో ఉమ్రాన్ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ లోనూ భారత్ తరపున ఉమ్రాన్ మాలిక్ అత్యధిక వేగంతో (157 కి.మీతో బంతిని విసిరాడు

# రంజీల్లో మరో రికార్డు నమోదు

### ట్రిపుల్ సెంచరీతో పృథ్వీషా రికార్డు



ముంబై,జనవరి11(సమసమాజం): ముంబై ఆటగాడు పృథ్వీ షా రంజీ ట్రోఫీ కెరీర్‌లో తొలి ట్రిపుల్ సెంచరీ సాధించాడు. 383 బంతుల్లో 379 పరుగులు చేసి.. తృటిలో నాలుగో సెంచరీని వదులుకున్నాడు. రంజీ ట్రోఫీ చరిత్రలో ఇది రెండో అత్యధిక ఇన్నింగ్‌గా నమోదైంది. అంతకు ముందు బీబీ నింబాల్కర్ 1948-49 సీజన్‌లో మహారాష్ట్ర తరపున 443 పరుగులతో అజేయమైన ఇన్నింగ్స్ ఆడి రికార్డు నెలకొల్పాడు. రంజీ ట్రోఫీలో ఓపెనర్ చేసిన అత్యధిక స్కోరు కూడా పృథ్వీదే. 379 పరుగులు చేసిన త్రిపుర ఆటగాడు సమిత్ గోహెల్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. గోహెల్ 2016 లో 359 పరుగులతో నాటౌట్‌గా ఇన్నింగ్స్ ఆడాడు. రంజీ ట్రోఫీ రౌండ్-5 మ్యాచ్ ముంబై-అసోం మధ్య గౌహతిలో జరుగుతున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు మంగళవారం 2 వికెట్లకు 397 పరుగులు చేసింది. పృథ్వీ 240 పరుగులతో క్రీజులో ఉన్నాడు. బుధవారం తొలి సెషన్‌లో 326 బంతుల్లో ట్రిపుల్ సెంచరీని పూర్తి చేసిన పృథ్వీషా 379 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతడు 49 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. రంజీ ట్రోఫీలో అతడి అత్యుత్తమ స్కోరు కూడా ఇదే. అంతకుముందు పృథ్వీషా 2019-20 రంజీ సీజన్‌లో బరోడాపై 202 పరుగులు చేశాడు. రెండో సెషన్‌లో ముంబై 3 వికెట్లకు 608 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే సెంచరీ చేసి సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి ఆడుతున్నాడు. రంజీ ట్రోఫీలో ముంబై ఆటగాడు చేసిన అత్యధిక స్కోరును కూడా పృథ్వీషాదే కావడం విశేషం. 1990-91 సీజన్‌లో హైదరాబాద్‌పై ముంబై తరపున ఆడిన సంజయ్ మంజ్రేకర్ 377 పరుగులు చేశాడు. ప్రస్తుత రంజీ మ్యాచ్‌లో 379 పరుగులు చేసిన పృథ్వీషా.. 33 ఏండ్ల క్రితం సంజయ్ మంజ్రేకర్ నెలకొల్పిన రికార్డును కూడా బద్దలు కొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో 4 మ్యాచుల్లో 2 గెలిచి ఎలైట్ గ్రూప్-బీ పాయింట్ల పట్టికలో ముంబై జట్టు రెండో స్థానంలో ఉన్నది. ఒక మ్యాచ్‌లో ఓడిపోగా.. ఒకటి డ్రా చేసుకోవడంతో ఈ జట్టుకు 16 పాయింట్లు వచ్చాయి. ఈ గ్రూప్‌లో సౌరాష్ట్ర జట్టు 19 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నది. ఈ గ్రూప్‌లోని టాప్-2 జట్లు నాకౌట్ రౌండ్‌లో ఆడతాయి.

# ఓటమితో ఆరంభించిన స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్

కౌలాలంపూర్,జనవరి11(సమసమాజం): ఇండియా స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ కొత్త ఏడాదిని ఓటమితో ఆరంభించారు. మంగళవారం మొదలైన మలేసియా ఓపెన్‌లోనూ ఈ ఇద్దరు తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. విమెన్స్‌సింగిల్స్‌లో సైనా 12-21, 21-17, 12-21తో హన్ యూ (చైనా) చేతిలో ఓడింది. మెన్స్‌లో శ్రీకాంత్ 19-21, 14-21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో కంగుతిన్నాడు. విమెన్స్ డబుల్స్‌లో ట్రీసా జోలీగాయత్రి 21-19, 21-14తో ఎగునా టింగ్‌పు లామ్ (హాంకాంగ్)పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు.ం






# గోల్డెన్ గ్లోబ్ పురస్కారం

## దక్కడంగర్వంగా ఉంది: పవన్ కళ్యాణ్

ఆర్.ఆర్.ఆర్. చిత్రంలోని 'నాటు నాటు' గీతానికి ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం దక్కడం భారతీయులందరూ ఎంతో సంతోషించదగ్గ పరిణామం అని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా ఆర్ఆర్ఆర్ టీమ్‌ను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకొన్న ఈ గీతానికి స్వరకల్పన చేసిన శ్రీ ఎం.ఎం.కీరవాణి గారికి అభినందనలు. తెలుగు గీతానికి ఉన్న కీర్తిప్రతిష్టలను గోల్డెన్ గ్లోబ్ పురస్కారం మరింత ఇనుమడింపచేస్తుంది. 'నాటు నాటు' గీతాన్ని రచించిన శ్రీ చంద్రబోస్, ఆలపించిన గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవలకు ప్రత్యేక అభినందనలు. ఆస్కార్ పురస్కారం కోసం పోటీపడుతున్న ఈ చిత్రం ఆ వేదికపైనా పురస్కారాలు పొందాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ చిత్రాన్ని ప్రపంచ స్థాయి ప్రశంసలు పొందేలా రూపుదిద్దిన దర్శకుడు రాజమౌళి, చిత్ర కథానాయకులు రాంచరణ్, ఎన్టీఆర్, నిర్మాత డి.వి.వి.దానయ్య అభినందనీయులు అంటూ పవన్ ట్వీట్ చేశారు. అలాగే హీరో విజయ్ దేవరకొండ కూడా ఆర్ఆర్ఆర్ మూవీ పై ప్రశంసలు కురిపించారు.

# రెండు సినిమాలు.. డబుల్ ఆనందం

### హీరోయిన్ శృతిహాసన్ వెల్లడి



ఓవైపు బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి'.. మరోవైపు చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' చిత్రాల్లో నటించింది శ్రుతిహాసన్. ఇవి రెండూ సంక్రాంతి కానుకగా ఈనెల 12, 13 తేదీల్లో విడుదల అవుతున్నాయి. ఈ సందర్భంగా శ్రుతిహాసన్ ఆనందం వ్యక్తంచేసింది. తాను నటించిన రెండు సినిమాలు ఒకేసారి రిలీజ్ కావడం ఇది రెండోసారి. అదికూడా చిరంజీవి, బాలకృష్ణ లాంటి బిగ్ స్టార్స్ సినిమాలు కావడంతో ఆనందంగా ఉంది. చాలా అదృష్టంగా ఫీలవుతున్నా. ఏ సినిమాలో నా క్యారెక్టర్ బాగుంది అని పోలికలు పెట్టుకునే అవకాశం లేదు. ఎందుకంటే రెండూ వేర్వేరు కథలు, వేర్వేరు పాత్రలు. 'వీరసింహా రెడ్డి'లో నా పాత్ర ఫన్ ఫుల్‌గా ఉంటుంది. 'వాల్తేరు వీరయ్య'లో కంప్లీట్ డిఫరెంట్. రెండు పాత్రలు చాలెంజింగ్‌గా ఉన్నవే. 'వాల్తేరు వీరయ్య'లో నా పాత్రని దర్శకుడు బాబీ చాలా చక్కగా డిజైన్ చేశారు. చిరంజీవి గారితో ఓ ఫైట్ ఉంది. రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ చాలా మంచి కాన్సెప్ట్‌తో దాన్ని తీశారు. నాక్కూడా యాక్షన్ అంటే చాలా ఇష్టం. ఆ ఫైట్ గురించి ఇప్పుడే చెప్పేస్తే ప్రేక్షకులకు థ్రిల్ పోతుంది. ఇక 'వీరసింహారెడ్డి'లో కామెడీ చేశా. చిరంజీవి, బాలకృష్ణ గార్లతో డ్యాన్స్ చేయడం నైస్ ఎక్స్‌పీరియన్స్. వారిద్దరూ చాలా మంచి డ్యాన్సర్లు. 'సుగుణ సుందరి' పాట వైడ్‌గా రీచ్ అయ్యింది. 'శ్రీదేవి చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది. ఇద్దరితోనూ పని చేయడం గొప్ప అనుభవం. బాలకృష్ణ గారు పాజిటివ్ ఎనర్జీతో ఉంటారు. దేవుణ్ని బలంగా నమ్ముతారు. చిరంజీవి గారు చాలా ప్రశాంతంగా, సున్నితంగా ఉంటారు. వారిద్దరి నుండి చాలా మంచి విషయాలు నేర్చుకున్నా. ఇక ఇవి రెండూ ప్రత్యేకమైన సినిమాలు. కథలు, పాత్రలు, ట్రీట్ మెంట్ డిఫరెంట్‌గా ఉంటాయి. రెండు సినిమాలకి డిఫరెంట్ ప్లస్ పాయింట్స్ ఉన్నాయి. తెరపై కూడా ప్రేక్షకులు ఆ ఎనర్జీని ఎంజాయ్ చేస్తారు. ఈ రెండింట్లో నేను నటిస్తున్నప్పుడు నాన్న చాలా హ్యాపీగా ఫీలయ్యారని చెప్పుకొచ్చింది.

# నేడు విడుదలవుతున్న వీరసింహారెడ్డి

### యూఎస్‌లో భారీ అంచనాలతో విడుదల

సంక్రాంతికి భారీ సినిమాలు పోటీపడుతున్న విషయం తెలిసిందే. మూడు తెలుగు సినిమాలతో పాటు రెండు తమిళ డబ్బింగ్ మూవీస్ ఈ సంక్రాంతికి పోటీ పడుతున్నాయి. ఇందులో టాలీవుడ్ అగ్ర కథానాయకులు నందమూరి బాలకృష్ణ నటించిన సినిమాతో పాటు మెగాస్టార్ చిరంజీవి ఊర మాసీవ్ ఎంటర్ టైనర్ కూడా వుంది. ఇందులో తమిళ డబ్బింగ్ మూవీ 'తెగింపు'తో సంక్రాంతి సందడి థియేటర్ల వద్ద మొదలైంది. ఈ క్రమంలో 12న గురువారం నందమూరి బాలకృష్ణ 'వీర సింహారెడ్డి' రిలీజ్ కాబోతోంది. ఆ తరువాతే జనవరి 13న మెగాస్టార్ చిరంజీవి నటించిన మాసీవ్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'వాల్తేరు వీరయ్య' బరిలోకి దిగుతోంది. ఇప్పటికే విజయ్ హీరోగా నటించిన 'వారసుడు' అజిత్ నటించిన 'తెగింపు' డబ్బింగ్ సినిమాలకు సంబంధించిన టాక్ బయటికి రావడంతో ప్రస్తుతం అందరి దృష్టి టాలీవుడ్ అగ్రహీలు నందమూరి బాలకృష్ణ నటించిన 'వీర సింహారెడ్డి'. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య'లపైనే వుంది. ఈ రెండు సినిమాల్లో బాలకృష్ణ నటించిన 'వీర సింహారెడ్డి' జనవరి 12న మరి కొన్ని గంటల్లో రిలీజ్ కాబోతోంది. ఇదిలా వుంటే ఈ మూవీ యుఎస్ ప్రీమియర్ షోలు మరి కొన్ని గంటల్లో పడబోతున్నాయి. తొలిసారి యుఎస్ లో బాలయ్య సినిమాకు భారీ క్రేజ్ ఏర్పడిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అడ్వాన్స్ ప్రీమియర్స్ కోసం ఈ మూవీకి భారీ డిమాండ్ ఏర్పడిందని ఇప్పటికే భారీ స్థాయిలో ప్రీమియర్స్ కోసం టికెట్స్ అమ్ముడు పోయాయని 287 లొకేషన్ లలో ఈ మూవీ ప్రీమియర్ షోల కు అడ్వాన్స్ బుకింగ్ పరంగా 525 కె డాలర్లని రాబట్టినట్టుగా చెబుతున్నారు.అంటే ఇప్పటికే ప్రీమియర్స్ అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో 'వీర సింహారెడ్డి' హాఫ్ మిలియన్ మార్క్ ని దాటడం విశేషం. బాలయ్య సినిమాల్లో ఇది రికార్డు గా చెబుతున్నారు. గతంలో బాలకృష్ణ నటించిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' 473కె గౌతమి పుత్ర శాతకర్ణి 375కె అఖండ 331కె మాత్రమే సాధించగా 'వీర సింహారెడ్డి' మాత్రం అడ్వాన్స్డ్ ప్రీమియర్స్ తో రికార్డుని సృష్టించడం విశేషం. ఇదిలా వుంటే జనవరి 13న మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కాబోతోంది. 12న యుఎస్ ప్రీమియర్స్ పడబోతున్నాయి. 274 ఏరియాల్లో రిలీజ్ అవుతున్న ఈ మూవీ అడ్వాన్స్ ప్రీమియర్స్ ద్వారా 398 కె మాత్రమే రాబట్టడం గమనార్హం.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in